
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.5
కనిష్ఠం 24.4

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి


5

ఆదివారం 4 ఆగస్టు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	565.00 (244.1480)	5,24,288	39,741
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.00 (3.70)	138.77	514.80
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	119.58 (3.68)	24,952	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.124 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230



భూ సమస్యల పరిష్కారం దిశగా

ఏళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యల పరిష్కారంలో 'ధరణి' వైఫల్యాలను అధిగమించే లక్ష్యంతో ప్రభుత్వం క్షేత్రస్థాయి అధ్యయనానికి శ్రీకారం చుట్టింది. నూతన ఆర్‌వోఆర్-2024 చట్టాన్ని తీసుకొచ్చే క్రమంలో అన్ని రకాల భూసమస్యల పరిష్కారానికి నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని తిరుమలగిరి(సాగర్) మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది.

- తిరుమలగిరి(సాగర్)

- రాష్ట్ర స్థాయిలో పైలట్ ప్రాజెక్టుగా తిరుమలగిరి(సాగర్) మండలం ఎంపిక
- గ్రామాల్లో పర్యటించనున్న రెవెన్యూ బృందాలు

నూతన ఆర్‌వోఆర్ చట్టాన్ని రూపొందించే క్రమంలో తిరుమలగిరి(సాగర్) మండలంలో అధ్యయనానికి రెవెన్యూ బృందాన్ని ఏర్పాటుచేశారు. శనివారం కలెక్టరేట్‌లో ఆరుగురు తహసీల్దార్లతో కూడిన ఉన్నత స్థాయి రెవెన్యూ బృందానికి కలెక్టర్ నేతృత్వంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిసింది. రానున్న 15 రోజులు ఈ రెవెన్యూ బృందాలు మండలంలోని పలు గ్రామాల్లో సదస్సులు నిర్వహించి పరిష్కారానికి నోచుకోకుండా, భూసమస్యలతో సతమతమవుతున్న రైతుల నుంచి నిర్ణీత ఫార్మట్‌లో దరఖాస్తులు తీసుకోనున్నారు. అనంతరం ప్రతీ దరఖాస్తుదారు నుంచి సేకరించిన ఆధారాలు, రికార్డులను రెవెన్యూ రికార్డులతో సరిపోల్చి ప్రతీ రైతు సమస్యకు పరిష్కారం చూపించనున్నారు.

దశాబ్దాల వివాదాలు పరిష్కారమయ్యే దిశగా

మండలంలో ప్రధానంగా కృష్ణపట్టె ప్రాంతంలో ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్నాయి. చింతలపాలెం, నెల్లికల్లు, జమ్మనకోట, తిమ్మాయిపాలెం, తునికినూతలలో అత్యధికంగా సుమారు 6,816 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గతంలో ఈ భూములు ఉన్న సర్వే నెంబర్లు 22, 158, 162, 222, 223, 108, 172, 344, 407 తదితర సర్వే నెంబర్లలో వాస్తవ భూ రికార్డుల (ఆర్ఎస్ఆర్) కంటే అత్యధికంగా పాస్ పుస్తకాలు జారీ అయ్యాయి. రెవెన్యూ రికార్డు ప్రక్షాళన సమయంలో ఈ భూములన్నింటినీ అప్పటి ప్రభుత్వం పార్ట్-బీలో చేర్చింది. తదనంతరం పలుమార్లు ఈ భూముల్లో కాస్తు, కబ్జాలో ఉన్న రైతులను గుర్తించి కొందరికి పాస్‌పుస్తకాలు జారీ చేసింది. కాగా, నేటికీ పాస్‌పుస్తకాలు పొందలేకపోయిన రైతులు వందల సంఖ్యలో ఉన్నారు. వీరంతా నిత్యం వారి సమస్యల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

- చింతలపాలెం, నాయకునితండా, తిమ్మాయిపాలెం, బట్టువెంకన్నబావితండా గ్రామాల్లో కాందిశీకుల భూములు ఉన్నాయి. దేశ విభజన సమయంలో ఇక్కడి నుంచి తరలిపోయిన కాందిశీకుల భూములు కావడంతో వీటిపై సుమారు 70 ఏళ్లుగా కబ్జాలో ఉండి సేద్యం చేస్తున్న రైతులు నేటికీ హక్కులు పొందలేకపోయారు. సర్వే నెంబర్లు 28, 52, 60, 204, 24, 38లో సుమారు 2,500 ఎకరాల కాందిశీకుల భూముల వివాదం పరిష్కారానికి సంబంధిత రైతులు ఏళ్లుగా రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు.
- సాగర్ ముంపు గ్రామాలైనా సుంకిశాలతండాలో సర్వే నెంబర్ 67లో 1958లో 550 ఎకరాలకు అటవీ భూములకు పాస్‌పుస్తకాలు ఇచ్చినా, నేటికీ సంబంధిత గిరిజన రైతుల వివరాలు 1బీలో లేకపోవడంతో బ్యాంక్‌ల ద్వారా వ్యవసాయ రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలకు అర్హులు కాలేకపోతున్నారు. అదే సర్వే నెంబర్‌లో మిగిలిన భూములకు పాస్‌పుస్తకాలను నేటికీ కొందరు రైతులకు మంజూరుకాలేదు.
- నాగార్జునపేటతండాలో సర్వే నెం 12, 32లో రెవెన్యూ, ఫారెస్ట్ సరిహద్దు ఉండడంతో తండాలో ఆ భూములను పార్ట్-బీలో ఉంచడంతో తండాలోని గిరిజనులెవ్వరికీ పాస్ పుస్తకాలు రాలేదు. ఎర్రచెరువుతండాలో 1955 నుంచి 1993 వరకు సర్వే నెం.424లో ఉన్న భూమి ప్రభుత్వ భూమిగా రికార్డయింది. అయితే ఆ భూమిలో ఫారెస్ట్ అధికారులు మొక్కలను నాటడంతో వివాదం నెలకొంది. దీంతో ఫారెస్ట్, స్థానిక గిరిజన రైతుల మధ్య వివాదం కొనసాగుతోంది. అదేవిధంగా మండల కేంద్రంలో పలు ప్రభుత్వ భూముల్లో వెంచర్లు ఏర్పాటు కావడం, పలు గ్రామాల్లో ప్రభుత్వ, చెరువు శిఖం భూములు, దేవాదాయ భూములు ఆక్రమణలకు గురయ్యాయి. వీటిపై అధికారులు చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.
- మండలంలోని పలువురు రైతుల సర్వే నెంబర్లు, భూ విస్తీర్ణంలో తేడాలు, కాస్తు కబ్జాలో ఒక సర్వే నెంబర్‌లో ఉంటూ వాస్తవ భూమి వేరే సర్వే నెంబర్‌లో ఉండడం, సేద్యం చేస్తున్న అర్హులైన రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు రాకపోగా, కాస్తులో లేని వారికి పాస్‌పుస్తకాల జారీ, పెండింగ్ మ్యుటేషన్, ఇనామ్ భూములకు ఓఆర్‌సీ, భూముల వారసత్వం విషయంలో పలు వివాదాలు నేటికీ కొనసాగుతున్నాయి. వీటన్నింటికి ఈ పైలట్ ప్రాజెక్టులో పరిష్కారం లభించే అవకాశం ఉంది.

రాష్ట్రమంతా అమలు చేసే ఉద్దేశంతో

రెవెన్యూ ఉన్నత స్థాయి బృందాలు మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి సమస్యలను ఎదుర్కొంటున్న రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించడంతోపాటు ప్రతీ రైతు సమస్యకు కారణాన్ని గుర్తించి, వాటిని పరిష్కారించేలా చర్యలు తీసుకుంటారు. నిర్ణీతకాలంలో అన్ని భూ సమస్యలను పరిష్కరించి ఇక్కడ వచ్చిన ఫలితాల ద్వారా ఇదే నమూనాను రాష్ట్రమంతా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఉద్దేశంతోనే పైలట్ ప్రాజెక్టును ప్రారంభించారు.

అర్హులైన రైతులకు పాస్‌పుస్తకాలు వచ్చేలా చూస్తాం



తిరుమలగిరి(సాగర్) మండలంలోని అర్హులైన రైతులందరికీ పాస్‌పుస్తకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. మండలంలోని ఆయా గ్రామాల్లో ఐదుగురు తహసీల్దార్ల నేతృత్వంలోని రెవెన్యూ బృందాలు పర్యటిస్తాయి. సమస్యలుఎదుర్కొంటున్న రైతులు, వారి దగ్గర ఉన్న ఆధారాలతో అధికారులను సంప్రదించాలి. అవసరమైతే వెంటనే సర్వే చేసి అర్హులైన రైతులను నిర్ధారిస్తాం. ఈ ప్రాజెక్టు ఫలితాల ద్వారా రాష్ట్రమంతా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

- సి.నారాయణరెడ్డి, నల్లగొండ జిల్లా కలెక్టర్

పాస్‌పుస్తకాలు రాక ఇబ్బందులకు గురవుతున్నాం



సాగర్ ముంపు గ్రామం కావడంతో మాకు నాగార్జునపేట తండాలో భూములను ఇచ్చారు. ఏళ్ల క్రితం రెవెన్యూ అధికారులు వివాదం ఉందని, మా తండాలో ఎవ్వరికీ పాస్‌పుస్తకాలు ఇవ్వలేదు. దీంతో వ్యవసాయానికి బ్యాంకుల నుంచి రుణాలు, రైతుబంధు, రైతుబీమా ఏదీ కూడా మా తండా వాసులకు అందడం లేదు. అధికారులు వెంటనే మాకు పాస్ పుస్తకాలు వచ్చేలా చూడాలి.

- రమావత్ కనికి, నాగార్జునపేటతండా

పలు రకాల భూసమస్యల వల్లే

తిరుమలగిరి(సాగర్) మండలంలో వివిధ రకాల భూసమస్యలు ఉండడం వల్లే రాష్ట్ర స్థాయిలో పైలట్ ప్రాజెక్టుగా మండలాన్ని ఎంపిక చేసినట్టు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధరణి సమస్యల పరిష్కార కమిటీ సభ్యుడు, లీఫ్ ఫౌండర్ భూమి సునీల్, కోదండరెడ్డి, రాష్ట్ర స్థాయి రెవెన్యూ అధికారులు, ఇతర రెవెన్యూ నిపుణుల బృందం ఇటీవల ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో భూసమస్యలు, వాటి కారణాలు, పరిష్కార మార్గాల గురించి చర్చించారు. ఈ క్రమంలోనే మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి సూచన మేరకు నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమలగిరి(సాగర్) మండలాన్ని ఎంపిక చేశారు. మండలంలో ప్రభుత్వ, పట్టా, కాందిశీకుల, దేవాలయ, వక్ఫ్, ఇనామ్, అటవీ, ఆబాదీ, పోరంబోకు భూములతోపాటు నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన గ్రామాలకు పునరావాసం కల్పించబడిన భూములు, ఫారెస్ట్, రెవెన్యూ సరిహద్దు కలిగి ఉన్న భూముల వంటి విభిన్న భూ సమస్యలు మండలంలో ఉన్నాయి.

పూర్తిగా జమ కాలే!

- 2.66లక్షల రైతులకు 52వేల మందికే రుణమాఫీ
- మాఫీ రూ.365.74కోట్లు
- మూడో విడతకు 2.14లక్షల మంది ఎదురుచూపు



కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ ద్వారా ఫిర్యాదులు తీసుకుంటున్న అధికారి

భువనగిరి అర్బన్, ఆగస్టు 3: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు రుణమాఫీ పథకంలో లబ్ధిచేకూరని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు విడతలు దాటినందున మూడో విడతలోనైనా తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. మూడో విడతలో కూడా రుణమాఫీ కాకుంటే ముందే అందిన ఫిర్యాదుల మేరకు బ్యాంకు, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా విచారించి గ్రామకమిటీల ద్వారా రుణమాఫీ సమస్యలను అధికారులు పరిష్కరించనున్నారు. రేషన్ కార్డులు, పీఎం కిసాన్ పథకంలో లేనివారికి, ఆదాయ పన్ను చెల్లింపులే ప్రామాణికంగా కొంతమంది రైతుల పేర్లు రుణమాఫీ పథకంలో నమోదు కావడంలేదు. రేషన్ కార్డులో ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, కొడుకు పేర్లు ఉండి, వారసత్వంగా పొందిన భూమికి రుణం తీసుకున్న రైతులకు మాఫీ వర్తించడం లేదు. అదేవిధంగా గతంలో పాస్‌పుస్తకం ఉండి ప్రస్తుతం కొత్త పట్టాదారు పాస్‌పుస్తకం లేని రైతులకు కూడా పథకంలో లబ్ధిచేకూరడం లేదు.

రుణమాఫీపై 333 ఫిర్యాదులు

జిల్లావ్యాప్తంగా 17మండలాల్లో 2,66,881మంది రైతులకు తొలి విడత 36,483 మందికి, రెండోవిడత 16,143మందితో కలిపి మొత్తం 52,626మందికి పంటరుణాలు మాఫీ అయ్యాయి. ఇంకా 2,14,255మంది మూడో విడత రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. ఈనెల 1వ తేదీవరకు వ్యవసాయశాఖ విస్తరణ అధికారులకు రుణమాఫీపై 333 ఫిర్యాదులు వచ్చాయి. అందులో టోల్‌ఫ్రీ ద్వారా 50 ఫిర్యాదులు అందాయి. అధికారుల ద్వారా అందే ఫిర్యాదుల సంఖ్య మరింత పెరగనుండగా, ప్రత్యేకంగా కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ 08685-293312 నంబరుద్వారా రైతులనుంచి అందిన ఫిర్యాదులను నమోదు చేస్తున్నారు.

రేషన్‌కార్డులే ప్రామాణికం

ఇప్పటివరకు రెండు విడతల్లో నిధులు విడుదల కాగా, రుణమాఫీ జాబితాలో పేర్లు లేకపోవడంతో కొందరు రైతుల్లో ఆందోళన మొదలైంది.రుణమాఫీ పొందని రైతులు మండల విస్తరణ అధికారిని సంప్రదించి కావాల్సిన ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతా, పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఫోన్‌నంబర్లు తదితర ధ్రువపత్రాలతో ఫిర్యాదు చేస్తున్నారు. రేషన్‌కార్డు,పీఎంకిసాన్ పథకంతో పాటు మరో 16రకాల కారణాలతో రుణమాఫీ ముడిపడి ఉందని తెలుస్తోంది. రుణమాఫీ పొందని రైతులు ఆందోళన చెందుతుండగా, మూడో విడతల్లోనైనా లేదా చివరగా గ్రామ కమిటీల్లోనైనా లబ్ధి చూకూరుతుందని ఆశతో ఉన్నారు.

రూ.365.74కోట్ల రుణమాఫీ

భూ పట్టాదారు పాస్‌పుస్తకం ద్వారా 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు సంబంధిత బ్యాంకుల్లో రుణాలు పొందిన రైతులకు ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించింది. రెండు విడతల్లో రూ.365.74కోట్ల రుణమాఫీ చేసింది. ఈ ఏడాది జూలై 18న మొదటి విడత రూ.లక్ష రుణమాఫీకి రూ.199.87కోట్లు, జూలై 30న రెండో విడత రూ.1.50లక్షల రుణాలు రూ.165.87కోట్ల మేర రుణమాఫీ జరిగింది. మొదటి, రెండో జాబితాలో పేర్లు రాని రైతులు ఆగస్టులో మూడో విడత రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు.

ఆందోళన అవసరం లేదు



రుణమాఫీ పొందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మూడో విడతలో పొందొచ్చు. లేదంటే గ్రామ కమిటీల ద్వారానైనా రుణమాఫీ పొందొచ్చు. లాగిన్ ఇచ్చిన తర్వాత జిల్లాలో అందిన ఫిర్యాదుల మేరకు పట్టాదారు పాస్‌పుస్తకం అప్‌లోడ్ చేయాలి. ఫైనల్ చేసేది హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో. ఆ తరువాత రైతులకు రుణమాఫీ కేటాయింపు జరుగుతుంది.

- కే.అనురాధ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

అవినీతి అధికారులను బదిలీ చేయాల్సిందే

- అర్చకుల బదిలీలు మాత్రమే ఆపాలి
- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



గుట్టలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 3: యాదగిరిగుట్ట దేవస్థానంలోని అవినీతి అధికారులను బదిలీ చేయాల్సిందేనని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. శనివారం గుట్టలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను గత నెల 30న అసెంబ్లీ సమావేశాల్లో దేవస్థానం ఉద్యోగుల బదిలీలు నిలిపివేయాలని అనలేదని, రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న అర్చకుల బదిలీలు మాత్రమే నిలిపివేయాలని అంటే ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధికోసం తన మాటలను వక్రీకరించాయన్నారు. గుట్ట దేవస్థాన బదిలీలు నిలిపివేయాలని మీడియా ద్వారా విమర్శించడం సమంజసం కాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో 40శాతం ఉద్యోగులను బదిలీ చేయాలని జీవో విడుదల చేసిందని, దానిని అడ్డుకోవడం ఎవరి తరం కాదన్నారు. యాదగిరిగుట్ట దేవస్థానం గతంలో అవినీతి ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఆందోళనలు చేసిన మాట నిజమేనని, అవినీతి ఉద్యోగుల బదిలీపై ఉపేక్షించేది లేదని, అవసరమైతే వారిని సస్పెండ్ చేయాలన్నారు. తాను ఇప్పటికే నూతన ఈవోను తీసుకొచ్చి, తిరుపతి తరహాలో అన్ని మార్పులు చేయిస్తున్నానన్నారు. అందరూ కలిసి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రూ.1800కోట్లతో దేవాలయం అభివృద్ధి చేస్తే సంతోషంగా ప్రజలు లేరని, యాదాద్రి అభివృద్ధి పేరుతో పేద భూములు లాక్కొని, ఇప్పటికీ పారితోషికం ఇవ్వలేదన్నారు. రైతుబీమా, రైతు భరోసా, సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు, ఎల్‌వోసీలను ప్రజలకు ఎప్పటికప్పుడు అందజేస్తున్నామని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అన్నం సంజీవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి మధుసూధన్‌రెడ్డి, యాదగిరిగౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేశం యాదవ్, గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, బందారపు భిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.

భూముల క్రమబద్ధీకరణకు చర్యలు

ఉప ముఖ్యమంత్రి భట్టి, రెవెన్యూ మంత్రి పొంగులేటీ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి అర్బన్, ఆగస్టు 3: లాండ్ రెగ్యులరైజేషన్ పథకం (ఎల్ఆర్ఎస్) ద్వారా భూముల క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్లకు సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పురపాలక, పటణాభివృద్ధి శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, ల్యాండ్, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, పంచాయతీరాజ్ సెక్రటరీ లోకేష్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు సంబంధించి వారు మాట్లాడారు. భూముల సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ జిల్లాలో మునిసిపల్, గ్రామపంచాయతీల పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఇందుకోసం సంబంధిత దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పట్టణ ప్లానింగ్ అధికారులు, పంచాయతీ అధికారులు మాస్టర్ ప్లాన్, రోడ్ల విస్తరణ, జోనల్ నిబంధనలు పరిశీలించి అన్ని సవ్యంగా ఉంటే ఫీజును నిర్ణయించడం జరుగుతుందన్నారు. కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే.గంగాధర్, భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీవోలు అమరేందర్, శేఖర్‌రెడ్డి, డీపీవో ఆర్.సునంద, నీటిపారుదల శాఖ అధికారి నర్సింహ, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ హనుమంతు కే.జెండగే



పీహెచ్‌సీ రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ జెండగే

తుర్కపల్లి, ఆగస్టు 3: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే సూచించారు. శనివారం తుర్కపల్లి మండల ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. కేంద్రం రికార్డులను, మందులను పరిశీలించారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా తదితర వ్యాధిగ్రస్తులపై ఆరా తీశారు. జ్వర లక్షణాలతో ఆరోగ్యకేంద్రానికి వచ్చిన వారందరికీ సరైన నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందించాలన్నారు. మందుల స్టాక్‌ను పాటించాలని, వైద్య సిబ్బందిని ఆదేశించారు. అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా వివరించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఓపీ సేవలను, గర్భిణుల ప్రసవాల తీరును పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ దేశ్యానాయక్, వైద్య సిబ్బంది ఉన్నారు.

రైతులకిచ్చిన హామీలను నెరవేర్చాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు భాస్కర్

భువనగిరి టౌన్, ఆగస్టు3: రైతులకిచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. శనివారం భువనగిరిలో జరిగిన బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. షరతులతో కూడిన రూ.2లక్షల రుణమాఫీతో పలువురు రైతులు లబ్ధికి దూరమయ్యారన్నారు. కౌలు రైతులకు రూ.15వేల ఇందిరమ్మ రైతు భరోసా, రైతు కూలీలకు రూ.12వేల ఆర్థికసాయం హామీలను ప్రభుత్వం అటకెక్కించిందన్నారు. కల్లబొల్లి మాటలతో పాలకులు రైతులను మభ్యపెడుతూ మోసగిస్తున్నారని విమర్శించారు. ఫలితంగా వ్యవసాయ రంగం ఇబ్బందులకు గురికానుందన్నారు. ఈమేరకు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే డిమాండ్‌తో గ్రామగ్రామాన రచ్చబండ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలు రచ్చబండలో పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. సమావేశంలో కిసాన్‌మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఫకీరు రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు బొట్టు అబ్బయ్య, దాసరి మల్లేశం, కర్నాటి ధనంజయ్, సురకంటి రంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎన్నం శివకుమార్, చందా మహేందర్ గుప్త, ఊట్కూరి అశోక్ గౌడ్, వల్దాస్ రాజుకాలభైరవ తదితరులు పాల్గొన్నారు.

సారాను అరికడుదాం.. సమాజాన్ని కాపాడుదాం



ఆకుతోటబావి తండాలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

భువనగిరి రూరల్, ఆగస్టు 3: సారాను అరికట్టి, సమాజాన్ని కాపాడుదామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.నరేందర్, డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాధాకిషన్ అన్నారు. శనివారం భువనగిరి మండలం ఆకుతోట బావితండా, సూరేపల్లి గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా నాటు సారాని తయారు చేయడం, నిల్వ ఉంచడం నేరమని, అలాంటి వారిపై కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా నాటుసారా తాగడం వల్ల కలిగే అనర్థాలను వారికి వివరించారు. అవగాహన కల్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐలు ఎ.గణేశ్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు సేవ చేయడం అభినందనీయం

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్



సాధన మానసిక దివ్యాంగుల సంస్థను సందర్శించిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి చందన

వలిగొండ, ఆగస్టు 3: దివ్యాంగులకు సేవ చేయడం అభినందనీయమని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.చందన అన్నారు. శనివారం మండలంలోని టేకులసోమారం గ్రామంలో సాధన మానసిక దివ్యాంగుల సంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దివ్యాంగులకు కల్పించే మౌలిక వసతులను పరిశీలించారు. ఎక్కువ మందికి సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్ బార్ అసోసియేషన్ కోశాధికారి మామిడి వెంకట్‌రెడ్డి, మండల లీగల్, సర్వీసెస్ అథారిటీ బాధ్యులు సాయిదీప్, కోర్టుసిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహజ్యోతి పథకం

ట్రాన్స్‌కో డీఈ మల్లికార్జున్



సదస్సులో మాట్లాడుతున్న డీఈ మల్లికార్జున్

భువనగిరి టౌన్, ఆగస్టు 3: అర్హులందరికీ గృహజ్యోతి పథకం లబ్ధి చేకూరుతుందని ట్రాన్స్‌కో డీఈ డీఎస్ మల్లికార్జున్ అన్నారు. గృహజ్యోతి పథకంపై స్థానిక 35వ వార్డులో కౌన్సిలర్ తంగళ్ళపల్లి శ్రీవాణి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు పథకం లబ్ధికోసం దరఖాస్తుచేసుకోని వారు వెంటనే మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో తగిన ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పథకంపై అవగాహన కల్పించి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏఈ సాయికృష్ణ, టీపీసీసీ సభ్యుడు తంగళ్లపల్లి రవికుమార్, ఎలిమినేటి కుమార్, జోగు అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో కార్డెన్‌సెర్చ్

తిరుమలగిరి, ఆగస్టు 3: సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలోని క్రాస్‌రోడ్ పరిసరాల్లో నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీ చేసి, లైసెన్స్, అనుమతిలేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రతీ వాహనదారుడు తమ వెంట, లైసెన్స్, బండి పత్రాలు ఉంచుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు పంపుతామన్నారు. తనిఖీల్లో ఎఐ సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

భువనగిరి అర్బన్, ఆగస్టు 3: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్యపూజలు జరిగాయి. స్వయంభువులను మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణప్రతిష్ఠామూర్తులను పంచామృతాలతో అభిషేకించి తులసిదళాలతో అర్చించారు. ఆలయంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం వైభవంగా చేపట్టారు. అదేవిధంగా స్వామి అమ్మవార్లను ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి నిత్యతిరుకల్యాణోత్సవం చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టారు. అలంకార వెండీ జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్యకైంకర్యాలు వైభవంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి నిత్యారాధనలు, నిత్యరుద్రహవన పూజలు కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.15,41,695 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, సంగీత కార్యక్రమంలో భాగంగా మధువంతి మధురస్వర కళాపీఠం ఆధ్వర్యంలో భక్తి సంగీతం, కూచిపూడి కళామృత నృత్య ప్రదర్శన నిర్వహించారు.



ఆలయంలో నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

బీఆర్ఏఓయూలో 31వరకు అడ్మిషన్లకు గడువు

● టెలీ కాన్ఫరెన్స్‌లో బీఆర్ఏఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధారాణి

● ఉన్నత విద్యకు మెరుగైన అవకాశాలు : బీఆర్ఏఓయూ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ధర్మానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ ధర్మానాయక్

నల్లగొండ క్రైం, జూలై 3 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ఏఓయూ)లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేశామని, ఈ నెల 31వ తేదీ వరకూ ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లను పొందవచ్చని బీఆర్ఏఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధారాణి తెలిపారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని బీఆర్ఏఓయూ రీజినల్ సెంటర్‌లో నిర్వహించిన స్టడీ సెంటర్ కోఆర్డినేటర్లు, జాక్టో, కౌన్సిలర్స్ సమావేశంలో యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డా.ధర్మానాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ సుధారాణి సమావేశంలో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ అర్హులైన వారంతా అడ్మిషన్లు పొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేసి ఈ ఏడాది అడ్మిషన్ల సంఖ్యను మరింతగా పెంచాలన్నారు. అనంతరం బీఆర్ఏఓయూ రిజిస్ట్రార్ డాక్టర్ ధర్మానాయక్ మాట్లాడుతూ బీఆర్ఏఓయూ ద్వారా ఉన్నత విద్యకు మెరుగైన అవకాశాలు ఉన్నాయని, మధ్యలో చదువు మానేసిన వారు ప్రతి ఒక్కరూ యూనివర్సిటీ కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దూర విద్యలో న్యాక్-ఏ గ్రేడ్ సాధించిన ఘనత బీఆర్ఏఓయూకే ఉందని, అందరి సమష్టి కృషితోనే గ్రేడు సాధించామన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ దూరవిద్యతోనే సకలం సిద్ధిస్తాయని భావించి ఓపెన్ యూనివర్సిటీలో యూజీ, పీజీ, డిప్లొమా సర్టిఫికెట్ కోర్సులను అందజేస్తుందన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు అడ్మిషన్లకు గడువు ఉందని, ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ప్రవేశం పొందాలని సూచించారు. రెగ్యులర్ విద్యకు దీటుగా బీఆర్ఏఓయూ విద్యావకాశాలను కల్పిస్తోందన్నారు. సమావేశంలో కళాశాల కోఆర్డినేటర్ అంతటి శ్రీనివాసులు, అధ్యాపకులు వరంగి రవికుమార్, సిబ్బంది బద్దం మహేష్, శ్రీకాంత్, రేఖ్యా నాయక్, రమేష్, శంకర్, సురేష్, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

అధికారుల తప్పిదం.. మహిళా రైతులకు శాపం

● ఒకే ఆధార్ నెంబర్ నమోదుతో మహిళా రైతులకు వర్తించని రుణమాఫీ


తెలంగాణ ప్రభుత్వం
పంటరుణమాఫీ 2024
రైతు సమాచార పత్రం

రైతు సమాచార పత్రంలో ఇద్దరు మహిళ రైతుల ఆధార్ నెంబర్ ఒకటే నమోదు చేయడంతో రిజెక్టు అయినట్లు తెలియజేసిన వ్యవసాయశాఖ

నల్లగొండ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వ్యవసాయశాఖ, బ్యాంకు అధికారుల తప్పిదం ఇద్దరు మహిళా రైతులకు శాపంగా మారింది. ఇద్దరికీ ఒకే నెంబర్ కలిగిన ఆధార్ నమోదు చేయడంతో ఇద్దరికీ రుణమాఫీ వర్తించకుండా పోయింది. వివరాల్లోకి వెళితే.. నల్లగొండ జిల్లాకేంద్రానికి చెందిన నన్నూరి కీర్తిరెడ్డికి, తిరుమలగిరిలోని యూనియన్ బ్యాంకులో 2023 డిసెంబరు 9 నాటికి రూ.89,531 పంట రుణం ఉంది. రుణమాఫీ నిబంధనల మేరకు కీర్తిరెడ్డి రుణమాఫీకి అర్హురాలు. అదేవిధంగా జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలానికి చెందిన బి.బీసమ్మకు అదే మండలం బొంకూరుకు చెందిన ఏపీజీవీబీలో 2023 డిసెంబరు 9 నాటికి రూ.1,29,479 రుణం ఉంది. నిబంధనల ప్రకారం ఈమె కూడా రుణమాఫీకి అర్హురాలే. మొదటి రెండు విడతల్లో వీరిద్దరి రుణాలు మాఫీ కాలేదు. తన రుణం ఎందుకు మాఫీ కాలేదో తెలుసుకునేందుకు నన్నూరి కీర్తిరెడ్డి వ్యవసాయశాఖ అధికారులను, బ్యాంకు అధికారులను సంప్రదించగా ఈమె ఆధార్ నెంబర్ స్థానంలో జోగులాంబ గద్వాల జిల్లా శ్రీనగర్‌కు చెందిన బీసమ్మ ఆధార్ నెంబర్ నమోదయిందని, అందువల్ల ఆధార్ నెంబర్ సక్రమంగా లేదనే కారణంతో ఇద్దరి రుణాలు మాఫీ జాబితాలో చేర్చలేదని తెలిపారు. కీర్తిరెడ్డి ఆధార్ నెంబర్ వేరే ఉండటంతో పాటు బ్యాంకు, జిల్లా అన్ని వేర్వేరు అయినా, ఈ తప్పిదం ఎలా జరిగిందనేది బాధిత మహిళా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీ లబ్ధిదారుల జాబితా తయారు చేసిన వ్యవసాయశాఖ కమిషనరేట్ సిబ్బంది నిర్లక్ష్యంతో తమకు అన్యాయం జరిగిందని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని నల్లగొండకు చెందిన కీర్తిరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా అధికారులను సంప్రదించగా తమకు దరఖాస్తు చేస్తే పరిశీలించి పొరపాటు సరిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పుతున్నారు. ఇలాంటి తప్పిదాలతో పెద్దసంఖ్యలో రైతులు రుణమాఫీ వర్తించకుండా నష్టపోయారని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

దివ్యాంగురాలి దారుణహత్య


రమ (ఫైల్ ఫొటో)

సూర్యాపేటరూరల్, ఆగస్టు 3: గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో ఓ దివ్యాంగురాలు దారుణహత్యకు గురైంది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండల పరిధిలోని జాటోతుతండాలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన ధరావత్ లాక్యా, లూది దంపతులకు తొమ్మిది మంది సంతానం. ఆరుగురు కూతుర్లు, ముగ్గురు కుమారులు. అందరిలో చివరి సంతానం రమ(37) పుట్టుకతో దివ్యాంగురాలు (ఒక కాలుకు పోలియో). తల్లిదండ్రులు 30ఏళ్ల క్రితమే అనారోగ్యంతో చనిపోయారు. రమకు వివాహం కాలేదు. ముగ్గురు సోదరులు ఉన్నా తండాలో ఆమె పదేళ్ల నుంచి ఒంటరిగా ఉంటూ ప్రభుత్వ పింఛన్‌తో జీవనం సాగిస్తోంది. శుక్రవారం రాత్రి ఇరుగుపొరుగు వాళ్లతో మాట్లాడిన రమ ఇంట్లోకి వెళ్లి నిద్రించింది. ఇంట్లో ఒంటరిగా ఉన్నది చూసిన దుండగులు అర్ధరాత్రి మరణాయుధాలతో తలపై మోది దారుణంగా హత్య చేశారు. శనివారం ఉదయం ఆమె రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉండడాన్ని చూసిన తండావాసులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సూర్యాపేట డీఎస్పీ రవి, రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ బాలునాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వెంటనే క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. కేసుతను అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. రమ మెడలో వెండి గొలుసు అలాగే ఉంది. లైంగికదాడికి పాల్పడి హత్య చేసి ఉంటారా? అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో నలుగురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య

చెరువులో దూకిన ఇంటర్ విద్యార్థి


సాయికుమార్(ఫైల్)

బీబీనగర్, ఆగస్టు 3: జులాయిగా తిరుగుతున్న కుమారుడిని తల్లిదండ్రులు మందలించడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో శనివారం వెలుగుచూసింది. ఎస్ఐ రమేష్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్‌లోని జామాఉస్మానియా ప్రాంతానికి చెందిన గుగ్గిల్ల సాయికుమార్(22) కొన్నిరోజులుగా తెలిసిన చోటల్లా అప్పు చేస్తూ జులాయిగా తిరుగుతున్నాడు. జూన్ 31న తల్లిదండ్రులు తీవ్రంగా మందలించారు. దాంతో తీవ్ర మనస్తాపానికి గురైన సాయికుమార్ అదేరోజు రాత్రి 11గంటల సమయంలో ఇంటి నుంచి స్కూటీని తీసుకుని బయటికి వెళ్లిపోయాడు. సాయికుమార్ ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు అన్నిచోట్లా వెతికినప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో అదేరోజు రాత్రి వారసిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేశారు. కాగా, శనివారం ఉదయం బీబీనగర్-జైనపల్లి మార్గంలో చెరువులో యువకుడి మృతదేహం కనిపించడంతో పాటు పక్కన స్కూటీని పార్క్ చేసి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు బీబీనగర్ పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక పోలీసులు స్కూటీని స్వాధీనం చేసుకుని మృతదేహాన్ని వెలికి తీసి పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్కూటీ నెంబర్ ప్లేట్ ఆధారంగా చిరునామాను గుర్తించి అప్పటికే మిస్సింగ్ కేసు నమోదైన వారసిగూడ పోలీసులకు బీబీనగర్ పోలీసులు సమాచారం అందించగా సాయికుమార్ కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. చెరువులో లభ్యమైన మృతదేహం తమ కుమారుడిదేనని తల్లిదండ్రులు గుర్తించారు. సాయికుమార్ సోదరి సౌందర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భువనగిరిలో ఉరివేసుకుని


భట్టు కార్తీక్(ఫైల్)

భువనగిరి టౌన్, ఆగస్టు 3 : తల్లి మందలించిందని మనస్తాపానికి గురైన ఇంటర్ విద్యార్థి శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలో ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ ఎస్ఐ కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం స్థానిక శ్రుతినగర్‌కు చెందిన భట్టు కార్తీక్(16) స్థానిక శ్రీ వైష్ణవి కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల ప్రారంభమైనప్పటి నుంచి సక్రమంగా తరగతులకు వెళ్లడం లేదు.ఆందోళనకు గురైన తల్లి కళాశాలకు ఎందుకు వెళ్లడం లేదంటూ కుమారుడిని మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన కార్తీక్ శనివారం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరివేసుకున్నాడు. కొద్దిసేపటికి తల్లి ఇంటికి వచ్చాక కుమారుడు ఆత్మహత్యకు పాల్పడింది గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. కార్తీక్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లెక్కలు బోధించేది లేదు

● నిరాకరించిన సామాన్యశాస్త్ర ఉపాధ్యాయుడు

● ఉరుమడ్ల జడ్పీహెచ్‌ఎస్‌లో నిలిచిన గణితం బోధన, డీఈవో విచారణ


ఉరుమడ్లలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడితో మాట్లాడుతున్న డీఈవో భిక్షపతి

చిట్యాలరూరల్, ఆగస్టు 3: సామాన్య శాస్త్రం ఉపాధ్యాయులు గణితం బోధించాలని విద్యాశాఖ ఉత్తర్వులు ఇవ్వడం, బోధించాల్సిన అవసరం లేదని తాజాగా హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల జడ్పీ ఉన్నతపాఠశాలలో 6, 7 తరగతులకు గణితం బోధించేదిలేదని ఓ ఉపాధ్యాయుడు మొండికేశాడు. దీంతో డీఈవో భిక్షపతి శనివారం ఈ పాఠశాలలో విచారణ నిర్వహించారు. గత ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభంలో సామాన్యశాస్త్ర ఉపాధ్యాయుడు విద్యార్థులకు గణితం బోధించాలని విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, ఈ విద్యాసంవత్సరం ఆరంభం నుంచి ఆ రెండు తరగతుల పనిభారాన్ని తగ్గించి గణితం, సామాన్యశాస్త్ర ఉపాధ్యాయుడు పనివిభజన ద్వారా బోధించాలని తీర్పునిచ్చింది. 6, 7వ తరగతుల విద్యార్థులకు సామాన్య శాస్త్ర ఉపాధ్యాయుడు గణితం చెప్పాల్సి ఉంది. 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు గణితం ఉపాధ్యాయుడు బోధించాలి. ఉరుమడ్ల ఉన్నతపాఠశాలలో గణితం బోధించని విషయం విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పగా, వారు అమ్మఆదర్శ పాఠశాల చైర్మన్ మర్రి మాధవి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానోపాధ్యాయుడు ఆదేశించినా గణితం బోధించేది లేదని ఆ ఉపాధ్యాయుడు భీష్మించాడు. ఈ విషయాన్ని మాధవి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన కలెక్టర్, డీఈవోకు సమాచారాన్ని చేరవేశారు. దీంతో డీఈవో ఈ పాఠశాలను సందర్శించి సమావేశం నిర్వహించారు. అయితే పని విభజన చేసుకొని చెరో తరగతి బోధించాలని డీఈవో ఆదేశించగా, తాను గణితం బోధించేది లేదని సదరు ఉపాధ్యాయుడు తేల్చి చెప్పాడు. దీనిపై నివేదిక రూపొందించి తనకు పంపాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బోధనం వెంకటొరెడ్డిని డీఈవో ఆదేశించారు.

సాగర్‌కు ప్రారంభమైన పర్యాటకుల రాక


ఎర్త్ డ్యాం వద్ద నుంచి జలాశయాన్ని చూస్తున్న పర్యాటకులు

నాగార్జునసాగర్, ఆగస్టు 3 : నాగార్జునసాగర్‌కు వరద పోటెత్తుతుండటం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకుల రాక ప్రారంభమైంది. గత ఎడాది సాగర్ జలాశయంలో నీరు లేకపోవడంతో పర్యాకులు నిరాశతో ఉన్నారు. ఈ ఏడాది ముందస్తుగా ఎగువ నుంచి వరద రావడంతో, అలాగే వారాంతం కావడంతో పర్యాటకులు కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు సాగర్‌కు వచ్చారు. సాగర్ ప్రధాన డ్యాంపైకి పబ్లిక్‌కు అనుమతి లేకపోవడంతో హిల్‌ఖాలనీ డౌన్ పార్కు వద్ద ఉన్న ఎర్త్ డ్యాం వద్ద నుంచి పర్యాటకలు జలాశయంలో కృష్ణమ్మ పరవళ్లను తిలకిస్తూ ఆనందంగా గడిపారు.

రెండో రోజూ మార్చురీలోనే అనిత మృతదేహం

నకిరేకల్, ఆగస్టు 3 : నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం నోముల గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న వివాహిత మృతదేహం రెండో రోజు శనివారం మార్చురీలోనే ఉంది. శుక్రవారం తెల్లవారుజామున అనిత ఆత్మహత్యకు పాల్పడగా పోస్టుమార్టం కోసం నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్య కారకుడైన టేకుల రాజేష్ మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని శుక్రవారం నుంచి పెద్దమనుషులు జరుపుతున్న రాజీ చర్చలు కొలిక్కి రాకపోవడంతో మృతదేహం మార్చురీలోనే ఉంది. మృతురాలి కుటుంబం నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయకపోవడం, పెద్ద మనుషుల చర్చలు ఫలించకపోవడంతో మృతదేహం మార్చురీలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

టీఎస్‌పీఎస్సీ శుక్రవారం రాత్రి విడుదల చేసిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) ఫలితాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా అభ్యర్థులు సత్తా చాటారు. వివిధ విభాగాల్లో ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించారు. ఏఈఈ ఉద్యోగం సాధించిన వారిలో ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తున్న వారు కూడా ఉండటం విశేషం.

ఏఈఈ ఫలితాల్లో మెరుపులు

● పంచాయతీ సెక్రటరీగా చేస్తూనే..


వివేక్

శాలిగౌరారం: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం బాలిశెట్టిగూడెం గ్రామానికి చెందిన బట్ట విక్రమ్ మిషన్ భగీరథ ఏఈఈగా ఎంపికయ్యారు. ప్రస్తుతం గ్రామకార్యదర్శిగా పనిచేస్తున్న విక్రమ్ పదో తరగతికి వరకు ప్రభుత్వ పాఠశాల్లో సాగింది. ఇంటర్ హైదరాబాద్‌లోని నాగోల్ గురుకులంలో, ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్, బీఈడీ పూర్తి చేశారు. వివేక్ ఏఈఈగా ఎంపికవడంపై తల్లిదండ్రులు బట్ట వెంకన్న, పూలమ్మలు ఆనందం వ్యక్తం చేశారు.


అనుపమ, అజయ్‌రెడ్డి

చండూరు రూరల్ : ఏఈఈలుగా నల్లగొండ జిల్లా చండూరు మండలం నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. కోటయ్యగూడెం గ్రామానికి చెందిన గాలెంక అనుపమ, కస్తాల గ్రామానికి చెందిన దోనాల అజయ్‌రెడ్డిలు పంచాయతీరాజ్ విభాగంలో ఏఈఈలుగా ఎంపికయ్యారు. కోటయ్యగూడెం గ్రామానికి చెందిన గాలెంక అనుపమ భర్త గాలెంక శ్రీశైలం గతంలో 2015లో ఏఈఈగా ఎంపిక కాగా ప్రస్తుతం ఆయన అసిస్టెంట్ ఎక్సిక్యూటివ్ ఇంజనీర్‌గా నల్లగొండ ఎల్ఎస్‌బీసీ పానగల్ రిజర్వాయర్ వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. దీంతో ఒకే కుటుంబంలో భార్యాభర్తలు ఇద్దరు ఏఈఈలు ఎంపిక కావడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు. అజయ్‌రెడ్డి ప్రస్తుతం గుర్రంపోడ్ మండలం చేపూర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు.


లిఖితసేన్

నూతనకల్: సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం సోమ్లాతండాకు చెందిన గిరిజన విద్యార్థిని గుగులోతు సాయిలిఖితసేన్ ప్రజారోగ్యం విభాగంలో ఏఈఈగా ఎంపికయ్యారు. ఎస్టీ విభాగంలో 4వ ర్యాంక్ సాధించారు.

● పేదరికం నుంచి ఏఈఈగా..


నాయిని ప్రీతి

నేరేడుచర్ల: రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబంలో పుట్టి చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదివి, ఉన్నత చదువులతో ఆర్అండ్‌బీలో ఉద్యోగం సాధించింది సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్నకు చెందిన నాయిని ప్రీతి. ఆర్థికఇబ్బందులతో ప్రీతి స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి వరకు విద్యనభ్యసించింది. తరువాత హైదరాబాద్‌లో పాలిటెక్నిక్ పూర్తి చేసి, ఆరోరా కళాశాలలో బీటెక్ చేసింది. టీఎస్‌పీఎస్సీ ఫలితాల్లో ప్రీతి రోడ్లు, భవనాల శాఖలో ఏఈఈగా ఎంపికైంది. తల్లిదండ్రులు నాయిని మణెమ్మ, సైదులులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ప్రీతిని అభినందించారు.


ఇందుకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

పాలకవీడు: సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం కోమటికుంట గ్రామానికి చెందిన గాదె ఇందు పంచాయతీ రాజ్ శాఖలో ఏఈఈగా ఉద్యోగం సాధించింది. ఇందు కోమటికుంట ప్రాథమికోన్నత పాఠశాలలో, జాన్‌పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పాఠశాల విద్యను అభ్యసించి, బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఉద్యోగం సాధించడంపై తల్లిదండ్రులు గ్రామస్థులు అభినందనలు తెలిపి, మిఠాయిలు తినిపించారు.

● తల్లిదండ్రుల కలలను నిజం చేస్తూ


కరుణాకర్

పెన్‌పహాడ్ : కూలీనాలీ పని చేస్తూ తనను చదివించిన తల్లిదండ్రులను కలలను నిజం చేస్తూ సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం భక్తాళాపురం గ్రామానికి చెందిన నెమ్మాది ఎల్లయ్య-లింగమ్మ దంపతుల నాల్గో కుమారుడు నెమ్మాది కరుణాకర్ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగానికి ఎంపికయ్యారు. తల్లిదండ్రులు రోజు వారి కూలీ పనులు చేసుకుంటూ కరుణాకర్‌ను చదివించారు.


తేజస్విని

● పెన్‌పహాడ్ మండలం రంగయ్యగూడెంకు చెందిన తొగరు తేజస్విని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ఉద్యోగానికి ఎంపికైంది. ఈమె భర్త తొగరు మణిదీప్‌కు రెండేళ్ల క్రితం తిరుపతి ఎయిర్‌పోర్ట్‌లో టెర్మినల్ మేనేజర్‌గా ఉద్యోగం వచ్చింది. ఆనాటి నుంచి తేజస్విని ఇష్టంతో చదివించారు. తేజస్విని ఏఈఈ ఉద్యోగం ఎంపిక కావడంపై వారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.


పుట్ట మహేష్, మందుల వంశీ

నడిగూడెం: నడిగూడెం మండలానికి చెందిన ఇద్దరు యువకులు పంచాయతీ రాజ్ విభాగంలో ఏఈఈలుగా ఉద్యోగాలు సాధించారు. బృందావనపురం గ్రామానికి చెందిన పుట్ట మహేష్, రామపురం గ్రామానికి చెందిన మందుల వంశీలు ఏఈఈలుగా ఎంపికయ్యారు. వారిని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

● సివిల్ ఇంజనీర్‌గా బస్సు డ్రైవర్ కూతురు


కానుగు నిఖిత

కట్టంగూరు : నిరుపేద కుటుంబంలో పుట్టి కష్టపడి చదివిన ప్రైవేట్ బస్సు డ్రైవర్ కుమార్తె నల్లగొండ జిల్లా కట్టంగూరుకు చెందిన కానుగు నిఖిత సివిల్ ఇంజనీర్ విభాగంలో ఏఈఈగా ఎంపికైంది. ఆమె తండ్రి ప్రైవేట్ బస్సు డ్రైవర్ కానుగు వెంకన్నగా పనిచేస్తున్నారు. నిఖిత ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపిక కావడంపై గ్రామస్తులు, బంధువులు అభినందించారు.


వెంకటేష్

● కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామానికి చెందిన రైతు బిడ్డ కావేటి వెంకటేష్ మిషన్ భగీరథ ఏఈఈగా ఎంపికయ్యారు. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తున్నారు. వెంకటేష్‌ను గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందించారు.


హర్షిణి

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన అన్నమళ్ల హర్షిణి ఇరిగేషన్ విభాగంలో ఏఈఈగా ఎంపికైంది. ఆమె తల్లిదండ్రులు ధర్మయ్య, స్వరూపారాణి ఇద్దరు కూడా ప్రభుత్వఉపాధ్యాయులు. హర్షిణిని గ్రామస్తులు, బంధువులు అభినందించారు.

పెట్రోల్ బంకులో రూ.50వేలు చోరీ

చిట్యాలరూరల్, ఆగస్టు 3: పెట్రోల్ బంకులోని గదిలో నిద్రిస్తున్న వారి జేబులోని రూ.50వేలను దొంగలు చోరీ చేశారు. ఈఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి పెట్రోల్‌బంకులో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. గుండ్రాంపల్లి శివారులోని పెట్రోల్ బంకులో విధుల్లో ఉన్న అంతటి శివలింగంతో పాటు మరో వ్యక్తి పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి సమయంలో ఒకరు బయట, మరొకరు లోపల గదిలో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి 2:30 దాటాక ద్విచక్రవాహంపై ముగ్గురు దొంగలు వచ్చి తదిలో నిద్రిస్తున్న శివలింగం జేబులో ఉన్న రూ.50వేల నగదు, సెల్‌ఫోన్‌ను చోరీ చేయబోరారు. ఇంతలో మేల్కొన్న శివసాగర్ దొంగల్లో ఒకడిని పట్టుకునే ప్రయత్నం చేశాడు. అయితే శివసాగర్‌ను అతడు విడిపించుకుని బైక్‌పై మిగతా వారితో పరారయ్యాడు. అనంతరం శివసాగర్ పరిశీలించగా జేబులోని రూ.50 వేల నగతో పాటు సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు గుర్తించి చిట్యాల పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మా తెలిపారు.

తమ్మరలో ఓ ఇంట్లో ..

అనంతగిరి, ఆగస్టు 3 : సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం తమ్మరబండపాలెం గ్రామంలో శనివారం ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కనగాల నవీన్ ఇంట్లో గుర్తుతెలియని దొంగలు ప్రవేశించి బీరువాలోని తులంన్నర లాకెట్‌తో ఉన్న నల్లపూసల గొలుసు, అరకేజీ వెండి పూజాసామాగ్రిని చోరీ చేశారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీంని పిలిపించి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

పోలీసుల అదుపులో నిందితులు?

వలిగొండ, ఆగస్టు 3 : హైదరాబాద్‌లో ఇల్లు కొనేందుకు అంటూ రూ.1.50 కోట్లు అప్పు తీసుకుని పరారైన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని గొల్నేపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, ప్రశాంత్, అనిల్, అన్నదమ్ములు హైదరాబాద్‌లో ఇళ్లు కొనడానికి డబ్బులు అవసరమని పలువురు గ్రామస్తులను నమ్మించి మాయమాటలు చెప్పి భారీగా నగదును అప్పుగా తీసుకున్నారు. జూలై 15న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులు ఉడాయించారు. అన్నదమ్ములు కనబడకపోయే సరికి అప్పు ఇచ్చిన వారికి అనుమానం వచ్చింది. తామంతా మోసపోయామని ఆలస్యంగా గమనించిన బాధితులు కొందరు రూ.1కోటి 50లక్షలు అప్పుగా ఇచ్చినట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ కేసును పరారీలో ఉన్న నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. నిందితులు అదుపులో ఉన్న వియమమై పోలీసులు స్పష్టత ఇవ్వడం లేదు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మల్లన్న

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 3: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వ సహకారంతో కృషి చేస్తానని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని వంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సరిపోను తరగతి గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఆయన వెంటనే స్పందించి విద్యార్థులకు అవసరమగు అదనపు గదుల నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయనను శాలువాతో సన్మానించారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం'ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

భువనగిరి టౌన్, ఆగస్టు 3: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని భువనగిరి పట్టణంలో విజయవంతం చేసేందుకు మునిసిపల్ యంత్రాంగం సమష్టిగా పనిచేయాలని మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 5నుంచి 9వరకు రోజుకు 7వార్డుల చొప్పున 35 వార్డుల్లో స్వచ్ఛదనం పచ్చదనంను నిర్వహించాలన్నారు. ఇందుకోసం వార్డుల వారిగా కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కమిషనర్ పి.రామాంజల్‌రెడ్డి, కౌన్సిలర్ నాజియా రహమాన్ జహంగీర్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా చైర్మన్, కమిషనర్ స్థానిక 15వ వార్డులో పర్యటించి సమస్యలను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచిస్తూ మొక్కలు నాటారు.

అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జయరాములు

వలిగొండ, ఆగస్టు 3: అమరుల స్ఫూర్తితో సమస్యల పరిష్కారం కోసం గీతకార్మికులు ఉద్యమించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొలగాని జయరాములు మాట్లాడుతూ, అమరులైన బొమ్మగాని ధర్మబిక్షం, భైరు మల్లయ్య, తొట్ల మల్సూర్, సూదగాని ఎట్టయ్య లాంటి ఎందరో అమరవీరులు కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం తమ జీవితాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. జిల్లాల్లో కార్మికుల సమస్యలపై సమరశీల ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాగిరి కృష్ణయ్య, నాయకులు పల్సం స్వామి, మద్దెల రాజయ్య, పబ్బతి మల్లేశం, కొండూరు అంజయ్య, సత్తయ్య, పల్సం లింగం, బంధారపు ధనుంజయ, గాజుల వెంకటేశం, గంధమల్ల గోపాల్, పల్సం చంద్రమౌళి, శంకరయ్య, లోడే మల్లేశం, మద్దెల మారయ్య పాల్గొన్నారు.

'జాబ్‌క్యాలెండర్‌కు చట్టబద్ధత కల్పించాలి'

అడ్డగూడూరు/ మోత్కూరు , ఆగస్టు 3: జాబ్ క్యాలెండర్‌కు చట్టబద్ధత కల్పించాలని బీఆర్‌ఎస్‌వీ నాయకులు డిమాండ్ చేశారు. అడ్డగూడూరు మండల కేంద్రంలో బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉద్యోగ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు పయ్యావుల రమేష్, ఉస్మానియా యూనివర్సిటీ నాయకులు బాలెంల బాబు మహజన్, గూడెపు పరమేష్, బాలెంల అరవిందు, నరేష్ ఉన్నారు.

● అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం జాబులు లేని జాబ్ క్యాలెండర్ ప్రకటించి, మరోసారి నిరుద్యోగులను ప్రభుత్వం మోసగించిందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జంగ శ్రీనివాస్ విమర్శించారు. మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు.

తపాస్‌పల్లి రిజర్వాయర్ నీటితో చెరువులను నింపాలి

రాజాపేట, ఆగస్టు 3: తపాస్‌పల్లి రిజర్వాయర్ నీటితో రాజాపేట మండలంలోని చెరువులను నింపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రాజాపేట మండలంలోని బొందుగులలో సీపీఐ నిర్మాణ మహసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కాల్వలను పూర్తి చేయాలని గంధమల్ల రిజర్వాయర్ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను ప్రభుత్వం పరిష్కారించాలని సమస్యల పరిష్కారానికి సీపీఐ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కొల్లూరి రాజయ్య, చిగుర్ల లింగం, బొల్లురి రాములు, పుట్ట గణేష్, శ్రీశైలం, రాజు, కరుణాకర్, ఉప్పలమ్మ, ఉప్పల్‌రెడ్డి పాల్గొన్నారు.

జానమ్మ మృతి సీపీఐకి లోటు : యానాల

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 3: మండలంలోని కూరెళ్ల గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ కార్యకర్త ఎరుకల జానమ్మ(80) మృతి పార్టీకి తీరని లోటు అని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. శనివారం సీపీఐ నాయకులు జానమ్మ భౌతికకాయంపై ఎర్ర జెండా కప్పి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా దామెదర్‌రెడ్డి మాట్లాడుతూ జానమ్మ కుటుంబ పార్టీకి ఎన్నో సేవలు అందించారని తెలిపాడు. కూరెళ్ల చుట్టు పక్క గ్రామాలకు సీపీఐ నాయకులు వచ్చినపుడు జానమ్మ ఇంటి వద్దనే సమావేశాలు నిర్వహించడం, వచ్చిన నాయకులకు జానమ్మే భోజనాలు అందించేదని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉప్పల ముత్యాలు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బత్తిని యాదగిరి, ఆత్మకూరు, మోత్కూర్ మండలాల కార్యదర్శులు మారుపాక వెంకటేష్, అన్నెపు వెంకట్, లింగయ్య, ఎస్.మల్లేష్ పాల్గొన్నారు.

ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి అర్బన్, ఆగస్టు 3: ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు సంబంధించి ఐదు నుంచి పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి ఎం. జయపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త, రెన్యూవల్ వంద శాతం ఉపకార వేతనాలు పొందేందుకు మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఎస్సీ కులాల అభివృద్ధి సహాయ అధికారులు వసతి గృహాల సంక్షేమ అధికారులు ఉపకార వేతనాలు పొందేందుకు చొరవ చూపాలని పేర్కొన్నారు.

ఆస్తిపన్ను మదింపులో నిర్లక్ష్యం



భువనగిరి వ్యూ, మునిసిపల్ కార్యాలయం



- నష్టపోతున్న మునిసిపాలిటీ
- 10 ఏళ్లుగా పెరిగిన పన్ను రూ.2.64 కోట్లు మాత్రమే
- ప్రస్తుత ఆస్తిపన్ను డిమాండ్ రూ.5.34 కోట్లు
- వాస్తవంగా రూ.10 కోట్లవరకు ఉంటుందని అంచనా..

భువనగిరి టౌన్, ఆగస్టు 3: మునిసిపాలిటీలకు ప్రధాన ఆదాయ వనరు ఆస్తిపన్ను. మునిసిపాలిటీల్లో నిర్మించే ప్రతీ భవనానికి ఆస్తిపన్ను మదింపు చేస్తూ పన్నును రాబట్టడం మునిసిపల్ రెవెన్యూ విభాగం ప్రధాన బాధ్యత. ఇది నిరంతరం సాగే ప్రక్రియ. కానీ నూతన భవనాలకు, ప్రస్తుతమున్న భవనాలపై అదనపు కట్టడాలు చేసిన భవంతుల లెక్కలను సేకరించి ఆస్తిపన్నును మదింపు చేయడంలో భువనగిరి మునిసిపల్ సిబ్బంది గుర్తు తెలియని కారణాలతో చూపుతున్న నిర్లక్ష్యంతో మునిసిపాలిటీ ఆస్తిపన్ను రూపకంలో తీవ్రంగా నష్టపోతోంది. ఫలితంగా నిధుల లేమి పట్టణ అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. 10 ఏళ్లగా భువనగిరి పట్టణ విస్తీర్ణం పెరగడంతో పాటు ఊహించని స్థాయిలో భవనాలు, అపార్ట్‌మెంట్స్ నిర్మాణం సాగినప్పటికీ పెరిగిన ఆస్తిపన్ను మాత్రం కేవలం రూ.2.64 కోట్లు మాత్రమే. పెరగడం ఆస్తిపన్ను మదింపులో మునిసిపల్ రెవెన్యూ విభాగం చూపిన, చూపుతున్న నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు అంటున్నారు.

భవనాల లెక్కలు సక్రమంగా సేకరించగలిగితే..

2014లో భువనగిరి మునిసిపల్ ఆస్తిపన్ను డిమాండ్ రూ.2.70 కోట్లు ఉండగా 2024 నాటికి 14,991 అసిస్మెంట్స్‌తో రూ.5,34,59,000కి చేరింది. కానీ ప్రస్తుతం ఉన్న భవనాలకు మునిసిపల్ సిబ్బంది సక్రమంగా లెక్కలు సేకరించగలిగితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్ను డిమాండ్ రూ.10కోట్ల వరకు చేరుతుందని మునిసిపల్ వర్గాలు ప్రైవేటుగా పేర్కొంటున్నాయి. కానీ ఆ దిశగా అధికారులతో పాటు సిబ్బంది శ్రద్ధ చూపకపోతుండటంతో ఏటా కోట్లాది రూపాయల ఆస్తిపన్ను నష్టపోతోంది. వాస్తవానికి భవన నిర్మాణం పూర్తయిన వెంటనే మునిసిపాలిటీ జారీ చేసిన నిర్మాణ అనుమతులు తదితర డాక్యుమెంట్స్‌తో ఆన్‌లైన్‌లో సెల్ఫ్ అసిస్మెంట్ చేసుకోవచ్చు. లేదా ఆఫ్‌లైన్‌లో మునిసిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. రెండు విధానాల్లోనూ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భవనాలను పరిశీలించి కొలతలను సేకరించి నిబంధనల ఆధారంగా ఆస్తిపన్ను మదింపు చేస్తారు. అనుమతులు లేకుండానే నిర్మించిన నూతన భవనాలను, అదనపు కట్టడాలను పట్టణ ప్రణాళిక విభాగంతో కలిసి పరిశీలించి, లెక్కలు సేకరించి ఆస్తిపన్ను మదింపు చేయాల్సి ఉంటుంది. అనుమతులకు మించి నిర్మించినా లేక అనుమతులు తీసుకోకుండానే నిర్మించిన భవనాలను అన్‌ఆథరైజ్డ్ నిర్మాణాలు (యూసి) పరిగణిస్తూ 100శాతం జరిమానాతో ఆస్తిపన్నును వసూలు చేయాల్సి ఉంటుంది. కానీ నిబంధనలన్నీ కాగితాలకే పరిమితం కాగా క్షేత్ర స్థాయిలో భిన్నమైన పరిస్థితి ఉంది. అధికారుల నిరంతర పర్యవేక్షణ కొరవడటం, రెవెన్యూ విభాగం సిబ్బంది ఉదాసీనత చూపుతుండటంతో మునిసిపాలిటీకి తీరని నష్టం జరుగుతోంది.

స్పెషల్ డ్రైవ్ చేపడతాం



మునిసిపల్ ఆదాయం పెంపు లక్ష్యంగా ఆస్తిపన్ను మదింపులో జరిగిన అవకతవకలను సవరించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నాం. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి భవనాల కొలతలన్నింటినీ పునఃసమీక్షించి, ఆస్తిపన్ను పెరుగుదలకు కృషి చేస్తాం. ఇందుకు భవన యజమానులు సహకరించాలి. మునిసిపాలిటీకి ఆదాయం ఉంటేనే అభివృద్ధి పనులు సాధ్యమవుతాయని అందరూ గ్రహించాలి. ఇటీవలే పలు భవనాలనుంచి రూ. 60 లక్షల వరకు నూతన ఆస్తిపన్నును సేకరించాం.

-పి.రామాంజుల్‌రెడ్డి, కమిషనర్, భువనగిరి మునిసిపాలిటీ

విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి



కరపత్రం విడుదల చేస్తున్న ఆవాజ్ నాయకులు

మోత్కూరు, ఆగస్టు 3: భువనగిరిలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న ఆవాజ్ రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ.ఎక్బాల్ కోరారు. శనివారం మోత్కూరులో రాష్ట్ర విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతుల కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. సమాజంలో ఉన్న రుగ్మతలను రూపుమాపి, రాజ్యాంగ విలువలను ప్రజలకు తెలియజేప్పడమే ఈ శిక్షణ తరగతుల ముఖ్య ఉద్దేశమన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. శిక్షణ తరగతులను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. లౌకిక, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఆహ్వానసంఘం ఉపాధ్యక్షుడు ఖాజాభాయ్, ఖాసింబాయ్, ఎండీ. అలీ, ఖలీల్, అబ్దుల్‌రహమాన్, ఎజాజ్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : దేశ ఐక్యత కోసం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ.ఇక్బాల్ తెలిపారు. భువనగిరిలో నిర్వహించే ఆవాజ్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులకు లౌకిక ప్రజాతంత్ర వాదులు మండల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలోని మసీద్ వద్ద కర పత్రాలను విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ కె.లతీఫ్, ఎండి.అజీయొద్దీన్ , ఎం.డి మోలీసాబ్, ఎం.డి జమాల్, ఎండీ.రంజాన్, హరున్, వృత్తిదారుల సంఘం మండల కన్వీనర్ వేముల బిక్షం పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన ఘనత చంద్రబాబుదే



ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

భువనగిరి టౌన్, ఆగస్టు 3: దేశంలోనే మొట్టమొదటగా ఎస్సీ వర్గీకరణను ఉమ్మడి రాష్ట్రంలో అమలు చేసిన ఘనత ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిదని టీడీపీ నాయకులు కొనియాడారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు మద్దతు తెలపడాన్ని హర్షిస్తూ శనివారం భువనగిరిలో సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. నాడు టీడీపీ ప్రభుత్వం చేసిన వర్గీకరణే నేడు సుప్రీం కోర్టు ఆమోదించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు శ్రీనివాస్‌గుప్త, నాయకులు దూసరి చంద్రశేఖర్‌గౌడ్, నాయిని విద్యాసాగర్, మాటూరి అంజనేయులు, సూరెపల్లి రాము, సైదులు, ఇటుకల స్వామి పాల్గొన్నారు.

● ఎస్సీ వర్గీకరణ సాధించిన మంద కృష్ణ మాదిగకు కృతజ్ఞతగా శనివారం రాత్రి భువనగిరిలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఆయన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. మునిసిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, విశ్రాంత ఎంఈవో బండారు రవివర్ధన్, సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బొడ్డు కృష్ణయ్య, గౌరవ అధ్యక్షుడు ఇటుకల జహంగీర్, స్వామి పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: బీజేపీ దళిత మోర్చా ఆధ్వర్యంలో సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం ప్రధాని నరేంద్రమోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బచ్చన గొని దేవేందర్, గుడెపంగా బిక్షం, భాస్కర్, నరసింహ, నందగిరి జగన్, గడ్డం స్వామి, బోడా అనిల్, కట్టెల మల్లేష్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలోని పల్లెర్ల గ్రామంలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్, అఖిలపక్షనాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల చంద్రస్వామి, నల్లారెడ్డి, మల్లారెడ్డి, నరేందర్‌రెడ్డి, నల్ల బాలరాజు, రామలక్ష్మయ్య, శేఖర్, మేడి స్వామి పాల్గొన్నారు.



పల్లెర్లలో మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సంక్షిప్తంగా..

మోత్కూరు : మండలంలోని ముశిపట్ల గ్రామానికి చెందిన బుషిపాక రమశ్రీ రెండేళ్లుగా అరుదైన వ్యాధి (తంబో తెరపిక్ పుర)తో బాధపడుతుండగా ఆమె చికిత్స కోసం మన మోత్కూరు వాట్సాప్ గ్రూపు సభ్యులు, దాతల నుంచి సేకరించిన రూ.43,500బాధితురాలి కుటుంబ సభ్యులకు అందించారు. వాట్సాప్ గ్రూపు ప్రతినిధులు దబ్బెటి సోంబాబు, కారుపోతుల వెంకట్, కోమటి మత్స్యగిరి, మొరిగాల శ్రీను, సూదగాని యాదగిరి, గనగాని రమేష్, కోమటి జనార్ధన్ పాల్గొన్నారు.

మోత్కూరు : ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మోత్కూరు మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఆలేరు రూరల్: నియోజకవర్గ కేంద్రం ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ అన్నారు. ఆలేరులో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ నెల 5న రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ ఒక రోజు దీక్షా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆలేరు రూరల్: విద్యార్థులు పాఠశాల వయస్సు నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని జేఎంజే ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జయభార్గవి అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించి, విజేతలతో ప్రమాణ స్వీకారం చేయించారు. కరస్పాండెంట్ సిస్టర్ అనిస్ ఉన్నారు.

చౌటుప్పల్ టౌన్ : 2018లో నూతనంగా ఏర్పాటు చేసిన మునిసిపాలిటీలోని విలీన గ్రామపంచాయతీలకు చెందిన నాలుగో తరగతి సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంఆర్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ చౌటుప్పల్ మునిసిపాలిటీ అధ్యక్షుడు కాసోజు నర్సింహాచారి కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జనసమితి అధ్యక్షుడు కోదండరాంకు వినతి పత్రాలను అందజేశారు.

మోత్కూరు : వాహనాల్లో సైరన్ తో తిరుగుతూ ప్రజలను హడలెత్తించకుండా, ప్రజలకు చేరువయ్యేందుకు పోలీసులు నూతనంగా సైకిళ్లపై గస్తీ తిరుగుతున్నారు. మోత్కూరులో శనివారం రాత్రి మోత్కూరులో పోలీసు కానిస్టేబుళ్లు ఇద్దరు సైకిళ్లపై వెళుతూ జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో ప్రజలను పలుకరించారు.

మోత్కూరు : ఎమ్మెల్యే దానం నాగేందర్ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు ప్రజా ప్రతినిధిలా కాకుండా రౌడీలా మాట్లాడినట్టు ఉన్నాయని మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి విమర్శించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్‌పార్లమెంటరీ భాష వాడినా, తోలు తీస్తానంటూ తోటి ఎమ్మెల్యేలను శాసన సభలోనే హెచ్చరించినా సీఎం గాని, స్పీకర్ గాని ఖండించక పోవడం విడ్డూరమన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండలం చిల్లాపురం గ్రామానికి చెందిన మేకల యాదగిరి ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. ఈ ప్రమాదంలో సామగ్రి కాలిపోయి నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు పరసగోని నరసింహ మానవత దృక్పదంతో ఆ కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మెరుగు పెద్ద జంగయ్య, బండి యాదయ్య, సూర రామచంద్రయ్య, మెరుగు నాగేంద్రబాబు, మేకల గిరి, మేకల లక్ష్మయ్య పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రానికి చెందిన ఫొటోగ్రాఫర్ నూతి సైదులు మాతృమూర్తి నూతి సత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. నిరుపేద కుటుంబం కావడంతో తోటి ఫొటో గ్రాఫర్స్ కలిసి వారి కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఫొటో గ్రాఫర్స్ మండల అధ్యక్షుడు ఒరుగంటి లింగస్వామి, గౌరవ అధ్యక్షుడు పాలకూర్ల యాదయ్య, ఎస్‌కే.పాషా, కొండ శ్రీకాంత్, సాయి పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : మునిసిపాలిటీలో ఈ నెల 5న ఉదయం 10 గంటలకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు తెలిపారు. పట్టణంలో ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేయనున్న ప్రాంతాలను చైర్మన్ రాజు పరిశీలించారు. కార్యక్రమాల్లో ప్రజారోగ్య శాఖ డీఇ మనోహర, ఏఇ వెన్నెల కుమార్, మునిసిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్ లు దండ హిమబిందు అరుణ్ కుమార్, అరుణబాలకృష్ణ, పి.శ్రీధర్ బాబు, విజయ సతీష్, తాడూరి శిరీషపరమేష్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా మంజుల బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ప్రిన్సిపాల్ రామానుంజాచార్యులు హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో జనగామ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నుంచి బదిలీపై వచ్చారు.

రామన్నపేట: నేటి యువతకు స్ఫూర్తి ప్రధాత స్వామి వివేకానంద జీవితం అని యజ్ఞ ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు పాలెం వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వామి వివేకానంద జీవితం- సందేశం, సాహిత్యం పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ సభ్యులు యాట మహేందర్, నల్ల ఉదయ్‌కిరణ్, నల్ల భూమిక, కుకులారం రాణా ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని సర్వేల్ గ్రామానికి చెందిన పలువురికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. చెక్కుల మంజూరు కోసం కృషి చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో షేక్ షబ్బీర్, గుత్త శేఖర్ రెడ్డి, వెల్లంకి చంద్రయ్య గౌడ్, మానిపాటి సతీష్ కుమార్, పగిళ్ల యాదయ్య, వేనుముల శంకర్ రెడ్డి, చిలకరాజు రాజు, సుక్క స్వామి, చెరుకు నరేష్, వెల్లంకి నరేష్, బోల్లమల్ల సత్యానారాయణ, ఎస్ .మల్లేష్ , షేక్ ఎజాస్, తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ: మండలంలోని సుంకిశాల గ్రామానికి చెందిన మొగిలిపాక యాదయ్యకు రూ.19500 సీఎం రిలీఫ్ ఫండ్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చెరుకు శివయ్య, ఈతపు రాములు, మొగిలిపాక నర్సింహ, బొక్క బుచ్చిరెడ్డి, రాచమల్ల శంకరయ్య, స్వామి, పోలేపల్లి బాల్‌నర్సింహ పాల్గొన్నారు.

రామన్నపేట: మదర్ డెయిరీ మాజీ చైర్మన్ గంగుల కృష్ణారెడ్డి హైదరాబాద్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతుల పెళ్లి రోజు సందర్భంగా వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఖండించాలి



నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

భువనగిరి టౌన్, ఆగస్టు 3: సామ్రాజ్యవాద దేశమైన అమెరికా సహకారంతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న ఆటవిక దాడులను ప్రజలందరూ ఖండించాలని వామపక్షాలు అన్నాయి. పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ఖండిస్తూ శనివారం భువనగిరిలో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శులు ఎండీ.జహంగీర్, రాచకొండ జనార్ధన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్ మాట్లాడుతూ దాడులతో ఇప్పటివరకు భారీగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ఇజ్రాయిల్ దాడులకు పరోక్షంగా మద్దతు తెలుపుతూ హింసకు కారణమవుతోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, అడవయ్య, సోమన సబిత, పుట్ట రమేష్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే శాంతియుత సమాజం



రమణానందకు బిరుదు ప్రదానం చేస్తున్న మాసన చెన్నప్ప

భువనగిరి రూరల్, ఆగస్టు 3: ఆధ్యాత్మికతతోనే శాంతియుత సమాజం నెలకొంటుందని, ఈ ప్రాంత వాసులకు భక్తి భావం నెలకొల్పేందుకు కృషి చేస్తున్న సిద్ధగురు రమణానంద మహర్షిని ప్రతీ ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని ఉస్మానియా పూర్వ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ మాసన చెన్నప్ప అన్నారు. భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి శివారులోని శివశక్తి శిర్డీసాయి అనుగ్రహ మహాపీఠం రమణేశ్వరంలో శనివారం జరిగిన ఆధ్యాత్మికత కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన రమణానంద మహర్షికి శాస్త్రీయ శ్రీ చక్ర రూపకర్త బిరుదును ప్రదానం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీ విద్య ఉపాసకుడు దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

'ఎమ్మెల్యే అయిలయ్య ప్రమాణం చేయాలి'

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 3: దేవస్థానం ఉద్యోగుల బదిలీల విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రభుత్వ స్థానిక ఎమ్మెలే, విప్ బీర్ల అయిలయ్య, లక్ష్మీనరసింహస్వామి పాదాల వద్ద ప్రమాణం చేయాలని బీజేపీ మండల, పట్టణ అధ్యక్షుడు గుంటిపల్లి సత్యనారాయణ, కర్రె ప్రవీణ్, జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య డిమాండ్ చేశారు. శనివారం గుట్టలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొండపైన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు నాలుగు నెలల నుంచి వేతనాలు రాకుండా ఇబ్బందులు పడుతున్నా వారి సమస్యలు పట్టించుకోలేదని అన్నారు. నాయకులు ఆకుల చద్రమౌళి, బందారపు మల్లేశంగౌడ్, బోడ బుచ్చిబాబు, మధుగౌడ్, నరేష్, దేవేందర్, శివ పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాన ర్యాలీ

బొమ్మలరామారం, ఆగస్టు 3: అవయవ దానం అవశ్యకతను వివరిస్తూ బీబీనగర్ ఎయిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం బొమ్మలరామారంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిమ్స్ నుంచి పాదయాత్రగా వచ్చిన వైద్య బృందం స్థానిక విద్యార్థులు, ఏఎన్ఎం, ఆవ వర్కర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఏయిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ వికాస్ భాటియా మాట్లాడుతూ మరణానంతరం చేసే అవయవ దానం కొద్దిమందికి ప్రాణదానం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏయిమ్స్ వైద్య బృందం హెచ్‌వోడీ డాక్టర్ నీరజ్ అగర్వాల్, డాక్టర్ గోవర్ధన్‌రావు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా వైద్య శిబిరాలు



బాలికకు నేత్ర పరీక్ష నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

భువనగిరి టౌన్, ఆగస్టు 3: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ డి.బాలాజీ, రోటరీ క్లబ్ భువనగిరి సెంట్రల్ అధ్యక్షుడు ఎండీ.అనీఫ్ అన్నారు. ఆ రెండు సంస్థలు సంయుక్తంగా శనివారం భువనగిరిలోని ఖాదిం జామియా ఇస్లామియా అరేబియా పాఠశాలలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు లోను కావద్దని, ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. విద్యార్థులందరికీ నేత్ర పరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు సద్ది వెంకట్ రెడ్డి, వెల్లంకి పురుషోత్తంరెడ్డి, షేక్.హమీద్‌పాషా, ఎండి.ఖజీం అహమ్మద్, ఎండీ.సుజాఉద్దీన్ పాల్గొన్నారు.

నాస్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ

గుండాల, ఆగస్టు 3: నవంబరులో జాతీయ స్థాయిలో నిర్వహించే నాస్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని గుండాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు గంధం చంద్రకళ ఉపాధ్యాయులను కోరారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం నిర్వహించిన నాలుగు మండలాల తెలుగు ప్రాథమికోన్నత పాఠశాల సముదాయ సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థుల్లో భాష, నైపుణ్యాలు, కనీస అభ్యాసన, సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా భాష పండితుల నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సన్మానించారు. డీఆర్‌పీ ఉపేందర్, కే.రవి, వెంకటేష్, వెంకన్న పాల్గొన్నారు.